క్లుప్తంగా

వీరభద్రుడికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో వీరభద్రేశ్వర స్వామి

కొడంగల్ రూరల్: బసవేశ్వర స్వామివారి ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. నూతనంగా తయారు చేయించిన వీరవల్కకు రెండు రోజులుగా ధాన్యం, జలాధివాసాలతో పూజలు చేశారు. బుధవారం బసవేశ్వర ఆలయం నుంచి వీరభద్రేశ్వర దేవాలయం వరకు నూతన వీరవల్కతో ఊరేగింపు నిర్వహించి, పూజా కార్యక్రమాలు చేశారు. ధూపదీపనైవేద్యాలు సమర్పిస్తూ మంగళహారతులు పట్టారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అర్చకులు జగదీశ్వర్‌స్వామి, చంద్రశేఖర్ స్వామి, వీరశైవ లింగాయత్ సంఘం పట్టణ అధ్యక్షుడు విజయకుమార్, సభ్యులు బాలప్రకాష్, శివకుమార్, మోహన్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బొడ్రాయి పండుగ



ఉత్సవంలో పోతురాజుల విన్యాసం

దోమ: బాస్‌పల్లిలో మూడు రోజులుగా బొడ్రాయి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. బుధవారం సర్పంచ్ పద్మ, మాజీ సర్పంచ్ అనంతయ్య అర్చకులతో బొడ్రాయికి ప్రత్యేక పూజలు చేయించి, ప్రతిష్ఠింపజేశారు. కార్యక్రమానికి డీసీసీ అధ్యక్షుడు, పరిగి మాజీ ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్ మనోహర్ రెడ్డి బొడ్రాయికి ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవాల్లో పోతురాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. అనంతరం ఒక్కోనేత రూ.51 వేల విరాళం అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు కావటి శ్రీనివాస్, బిచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దళితబంధు లబ్ధిదారునికి ఆటో



గోపాల్‌కు ఆటో తాళాలు అందజేస్తున్న ఎమ్మెల్యే ఆనంద్

ధారూరు: దళితబంధు పథకం కింద రూ.10 లక్షలు మంజూరైన లబ్ధిదారుడికి బుధవారం ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ ఆటోను అందజేశారు. తరిగోపుల గ్రామానికి చెందిన మోత్కూరి గోపాల్‌కు దళితబంధు కింద మంజూరైన డబ్బులతో ఆటోను ఖరీదు చేశారు. ఈ మేరకు వికారాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ ఆవరణలో గోపాల్‌కు ఆటో తాళాలు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు దేవేందర్, వేణుగోపాల్‌రెడ్డి, వెంకట్‌రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం

కుల్కచర్ల: నిరుపేదలకు, బీజేపీ కార్యకర్తలకు తాము అండగా నిలుస్తామని బీజేపీ రాష్ట్ర కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు మారుతి కిరణ్ అన్నారు. బుధవారం చౌడాపూర్ మండలం అడవివెంకటాపూర్ గ్రామానికి చెందిన పార్టీ గిరిజన మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి గోవింద్ సోదరి సునిత మృతిచెందగా.. బుధవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో పార్టీ చౌడాపూర్ మండల అధ్యక్షుడు బంధయ్య, నాయకులు రమేష్ కుమార్, వెంకటయ్య, మల్లేశ్, అనిల్ కుమార్ పాల్గొన్నారు.

సమ్మర్ క్యాంపును వినియోగించుకోండి



సమ్మర్ క్యాంపును ప్రారంభిస్తున్న ప్రధానోపాధ్యాయుడు వీరేశం

దోమ: సమ్మర్ క్యాంపులను విద్యార్థులు వినియోగించుకోవాలని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వీరేశం అన్నారు. బుధవారం దోర్నాల్‌పల్లి పాఠశాలలో సమ్మర్ క్యాంపును ఆయన ప్రారంభించి మాట్లాడారు. వేసవిలో విద్యార్థుల సామర్థ్యాలను పెంపొందించడమే లక్ష్యంగా ఈ క్యాంపులను ఏర్పాటు చేస్తున్నామని, ప్రతి విద్యార్థికి కథలు, పుస్తక పఠనం, ఆటలు ఆడటం, బొమ్మలు గీయడం, నేర్పించేందుకు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో సీఆర్‌పీ వెంకటేశ్, మాజీ సర్పంచ్ వెంకటయ్య, స్కూల్ చైర్మన్ వెంకటయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పంటనష్టం పట్టని అధికారులు

- సర్వసభ్య సమావేశంలో సర్పంచులు
- సర్వేచేసి నివేదిక ఇవ్వండి
- అధికారులతో ఎమ్మెల్యే కాలె యాదయ్య



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యాదయ్య

నవాబుపేట: భారీ వర్షాలకు దెబ్బతిన్న పంటలను వ్యవసాయ అధికారులు పట్టించుకోవడం లేదని సర్పంచులు ఏఓపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ భవాని అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో సభ్యులు పలు సమస్యలపై మాట్లాడారు. వడగళ్ల వానకు వరి, కూరగాయలు తదితర పంటలు నీటి పాలయ్యాయని, వాటిని చూసే వారే లేరని సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేయగా.. ఏఓ లక్ష్మీ ప్రసన్న మాట్లాడుతూ మండలంలో 50 శాతం కన్నా ఎక్కువ నష్టం జరగలేదని చెప్పారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే కాలె యాదయ్య అధికారులు గ్రామాల్లో పర్యటించి పంటనష్టాన్ని అంచనా వేసి, ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. మాదిరెడ్డిపల్లి సబ్ సెంటర్ డాక్టర్‌ను వేరే ప్రాంతానికి పంపారని, పాతబడిన పాఠశాల భవనాన్ని కూల్చి వేయాలని ఎంపీటీసీ విజయ్‌కుమార్ సభ దృష్టికి తీసుకువచ్చారు. నవాబుపేట, ఆర్కతల, ఎల్లకొండ తదితర గ్రామాల్లో వయస్సు పైబడిన అంగన్‌వాడీ టీచర్లు ఉన్నారని, వారి వలన ఇబ్బందులు తలెత్తుతున్నాయని కొందరు సర్పంచులు సభ దృష్టికి తేగా.. వారి జాబితా ఇవ్వాలని సూపర్‌వైజర్ శ్యాలినిని ఎమ్మెల్యే ఆదేశించారు.

చేసిన పనులకు బిల్లులు లేవు

గ్రామాల్లో నిర్మించిన క్రీడాప్రాంగణాలకు, ఉపాధి హామీ కూలీలకు కొంత కాలంగా బిల్లులు రావడం లేదని, చేసిన పనులకు బిల్లులు రాకపోతే.. కొత్త పనులు ఎలా చేపట్టాలని సభ్యులు ప్రశ్నించారు. గ్రామాల్లో విద్యుత్ సమస్య పెరిగిందని, సంబంధిత అధికారులు, సిబ్బంది పట్టించుకోవడం లేదని సర్పంచులు ఆరోపించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సమష్టిగా పనిచేస్తే అభివృద్ధి సాధ్యమవుతుందని, సభ్యులు చెప్పిన సమస్యలపై సంబంధిత అధికారులు చొరవ తీసుకొని పరిష్కారమార్గం చూపాలని సూచించారు. గ్రామాల్లో మిషన్ భగీరథ పనులు పూర్తి చేయడం లేదని, తక్షణమే పనులు పూర్తిచేసి ఇంటింటికీ తాగునీరు వచ్చేలా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ జయమ్మ, పీఆర్‌డీఈ మాధవరెడ్డి, ఎంపీడీఓ సుమిత్రమ్మ, పీఏసీఎస్ చైర్మన్లు రాంరెడ్డి, పాపిరెడ్డి, ఎంపిటీసీలు పద్మనాగిరెడ్డి, తేజశ్విని, సుమలత, యశోద, సర్పంచులు శ్రీనివాస్‌గౌడ్, నర్సింహులు, పర్మయ్య, బాలయ్య, మాణిక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తడిసిన ధాన్యం కొంటాం



బూనీడులో కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

కొడంగల్: తడిసిన ధాన్యం కొనుగోలు చేస్తామని ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం కొత్తపల్లి మండలం బూనీడు, గిర్లోని బాయి, మన్నాపూర్, నందిగామ గ్రామాల్లో వరి కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. ముఖ్యమంత్రి కేసీఆర్ చొరవ వలన కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని, రైతులకు నష్టం కలగరాదని వారు సూచించన మేరకే.. మద్దతు ధర ఏ గ్రేడు రకానికి రూ.2,060, బీ గ్రేడుకు రూ.2,040 చొప్పున చెల్లిస్తామని తెలిపారు. ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు చేయనున్నట్లు చెప్పారు.

దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలి

నవాబుపేట: దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలని వికలాంగుల పరిరక్షణ కమిటీ జిల్లా అధ్యక్షుడు సుధీర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న వికలాంగుల పింఛన్లు మంజూరు చేయాలని, అంత్యోదయ కార్డుతో పాటు డబుల్ బెడ్‌రూం ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. సమావేశంలో వికలాంగుల నాయకులు వెంకటేశం, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

కొడంగల్ రూరల్: నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి అండగా నిలుస్తుందని మాజీ సర్పంచ్ రమేష్‌బాబు అన్నారు. ఈ సందర్భంగా బుధవారం పట్టణంలోని షాబజార్‌కు చెందిన షేక్ ఇస్నేతుల్లాకు రూ.22 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేశారు.

పరామర్శ

తాండూరు రూరల్: కోత్లాపూర్ గ్రామానికి చెందిన గని కార్మిక సంఘం డైరెక్టర్ కోటి గోపాల్ తల్లి అడివమ్మ అనారోగ్యంతో మృతి చెందగా.. విషయం తెలుసుకున్న టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రమేష్ మహరాజ్ బుధవారం గోపాల్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఇందులో పెద్దేముల్ జెడ్పీటీసీ ధారాసింగ్, నాయకులు జనార్దన్‌రెడ్డి, నర్సిరెడ్డి, రాజు ఉన్నారు.

విద్యార్థుల్లో సృజనాత్మకత వెలికి తీయాలి

తాండూరు టౌన్: విద్యార్థుల్లో దాగున్న సృజనాత్మకతను వెలికి తీయడంలో సమ్మర్ క్యాంపులు దోహదపడతాయని కృష్ణవేణి కాన్సెప్ట్ స్కూల్ ప్రిన్సిపాల్ ప్రశాంత్ అన్నారు. బుధవారం పాఠశాలలో సమ్మర్ క్యాంపును ప్రారంభించి మాట్లాడారు. ఏడాది పాటు చదువుతో కుస్తీ పట్టే విద్యార్థులు.. పుస్తకాలకు మాత్రమే పరిమితమవుతున్నారని, వారిలో దాగున్న నైపుణ్యాన్ని వెలికి తీయాలంటే సమ్మర్ క్యాంపులు అవసరమన్నారు. ఈ క్యాంపులో అన్ని పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొనవచ్చని తెలిపారు. నెల రోజుల పాటు గణితం, కాలిగ్రఫీ, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్, డ్రాయింగ్, పెయింటింగ్, కోడింగ్, స్కేటింగ్, బ్యాడ్మింటన్‌తో పాటు పలు విభాగాల్లో విద్యార్థులకు శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ సతీష్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బస్సులు రాకుండా అడ్డుగా గుంతలు

దారిలో మొక్కలు నాటే యత్నం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి: డీఎం



డీఎం సమతతో మాట్లాడుతున్న అంబేడ్కర్ సంఘం సభ్యులు

ధారూరు: బస్టాండ్‌లోకి వెళ్లే బస్సులకు అడ్డంగా మొక్కలు నాటే యత్నం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని తాండూర్ డిపో మేనేజర్ సమత బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రయాణ ప్రాంగణంలోకి సర్వీసులు వచ్చి పోయే దారుల్లో మొక్కలు నాటేందుకు కొందరు గుంతలు తీశారని, వారిని గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అనంతరం పోలీసుల సహాయంతో తవ్విన గుంతలను పూడ్చివేయించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ సంఘానికి చెందిన పలువురు డీఎంతో మాట్లాడారు. అంబేడ్కర్ విగ్రహం ఎదుట తగిన స్థలం లేదని, ఏమైనా కార్యక్రమాలు చేపట్టాలంటే దుమ్ముధూళితో ఇబ్బంది కలుగుతుందని, బస్సులు వెళ్లేదారిని కొద్దిగా ముందుకు జరపాలని డీఎంకు విన్నవించారు.

జేపీఎస్‌లను పర్మినెంట్ చేయాలి



సమ్మెకు మద్దతు తెలుపుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

పెద్దేముల్: జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులరైజ్ చేసి, ఉద్యోగ భద్రత కల్పించాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గోపాల్ డిమాండ్ చేశారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయం ఎదుట జేపీఎస్‌లు చేస్తున్న సమ్మెకు ఆయన మద్దతు తెలిపి మాట్లాడారు. ప్రొబేషన్ పీరియడ్ పూర్తి చేసుకున్న కార్యదర్శులందరినీ పర్మినెంట్ చేయాలన్నారు. కార్యక్రమంలో గోపాల్, మహేశ్, వెంకట చైతన్య, స్నేహలత, శ్రావణ్‌కుమార్, వాణి, అర్చన, చంద్రశేఖర్, ఆనంద్, కృష్ణ, సుశీల, ఇంద్రజ, అరుణ, మునిరొద్దీన్, హేమలత, గోపాల్, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

క్రమబద్ధీకరించాలి

నవాబుపేట: గ్రామాల్లో పని చేస్తున్న పంచాయతీ కార్యదర్శులను క్రమబద్ధీకరించాలని కోరుతూ జూనియర్ పంచాయతీ కార్యదర్శులు బుధవారం ఎమ్మెల్యే కాలె యాదయ్యకు వినతిపత్రం ఇచ్చారు. అనంతరం పలువురు సర్పంచులు కార్యదర్శులకు సంఘీభావం తెలిపి మాట్లాడారు. ప్రభుత్వం స్పందించి వెంటనే కార్యదర్శులను రెగ్యులరైజ్ చేయాలని కోరారు.

6వ రోజుకు చేరిన సమ్మె

అనంతగిరి: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జేపీఎస్, ఓపీఎస్‌లు చేపట్టిన సమ్మె బుధవారానికి 6వ రోజుకు చేరుకుంది. ఈ మేరకు వికారాబాద్ ఎంపీడీఓ కార్యాలయం ఎదుట చేపట్టిన నిరసనకు పలువురు సంఘీభావం తెలిపారు. దోమ మండలం సీనియర్ పంచాయతీ కార్యదర్శి రవీందర్‌రెడ్డి, టీఎస్‌పీఏ జాయింట్ కార్యదర్శి రాజేష్, కార్యవర్గసభ్యుడు ఎండీ అర్షద్, కంప్యూటర్ ఆపరేటర్లు మద్దతు తెలిపి మాట్లాడారు. జేపీఎస్, ఓపీఎస్‌లు చేస్తున్న సమ్మెకు ప్రభుత్వం స్పందించి, వారిని వెంటనే క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు.

అంధత్వ నివారణకు 'కంటివెలుగు'



కుల్కచర్ల: కంటి పరీక్ష చేస్తున్న వైద్య సిబ్బంది

నవాబుపేట: అంధత్వ నివారణ కోసం ప్రభుత్వం కంటివెలుగు కార్యక్రమాన్ని తీసుకువచ్చిందని, ప్రతి ఒక్కరూ ఆ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ యశోద అన్నారు. మాదిరెడ్డిపల్లిలో బుధవారం కంటివెలుగు కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. కంటి జబ్బుతో ఏ ఒక్కరూ బాధపడకూడదని, 18 సంవత్సరాలు నిండిన వారందరూ కంటి పరీక్ష చేయించుకొని, కంటిపాపను కాపాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ జయదీష్, ఎంపీటీసీ విజయ్ కుమార్, పంచాయతీ కార్యదర్శి వజ్రలింగం, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కంటి చూపును కాపాడుకోవాలి

కుల్కచర్ల: కంటివెలుగు కార్యక్రమాన్ని గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని లింగంపల్లి సర్పంచ్ మతం శారదమ్మ అన్నారు. చౌడాపూర్ మండల పరిధిలోని లింగంపల్లిలో కంటివెలుగును ప్రారంభించి మాట్లాడారు. అంధత్వ నివారణే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కార్యక్రమాన్ని తీసుకువచ్చిందని, ప్రతి ఒక్కరూ నేత్ర శిబిరాన్ని వినియోగించుకొని కంటి చూపును కాపాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కార్యదర్శి రాధ, నాయకులు వెంకటయ్య, శేఖర్, కృష్ణ, యాదయ్య, రాజు, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

గౌడబీమా.. హర్షణీయం

కుల్కచర్ల: గీత కార్మికులకు రూ.5లక్షల గౌడబీమా ప్రకటించడం హర్షణీయమని గౌడ సంఘం మండల అధ్యక్షుడు మాలె కృష్ణయ్య, మండల సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు వెంకటయ్యలు అన్నారు. బుధవారం వారు మాట్లాడుతూ.. గౌడ కులస్తుల కుటుంబాల సంరక్షణలో భాగంగా గీత కార్మికులకు బీమా పథకాన్ని అమలు చేస్తూ నిర్ణయం తీసుకోవడం సంతోషకరమన్నారు.

ఉత్తమ క్రీడాకారులను తయారు చేయాలి

తైక్వాండో మాస్టర్‌కు సూచించిన హోంమంత్రి



మనోహర్‌కు సర్టిఫికెట్ అందజేస్తున్న మంత్రి మహమూద్ అలీ, ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి

తాండూరు టౌన్: తైక్వాండో శిక్షకుడిగా ఉత్తమ క్రీడాకారులను తయారు చేయాలని తైక్వాండో మాస్టర్ మనోహర్‌కు హోంమంత్రి మహమూద్ అలీ సూచించారు. మంగళవారం రాత్రి స్థానిక సమద్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన ఈద్ మిలాప్ కార్యక్రమానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరై.. తైక్వాండో కొరియా 5వ డాన్ సర్టిఫికెట్ సాధించిన మనోహర్‌ను అభినందించి, ధ్రువపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి క్రీడాకారునికి అభినందనలు తెలిపారు. అనంతరం మనోహర్ మాట్లాడుతూ తాండూరు నుంచి ఇంటర్నేషనల్ తైక్వాండో క్రీడా పోటీలకు ప్రాతినిధ్యం వహించేలా విద్యార్థులను తీర్చిదిద్దుతానని తెలిపారు.

మత్స్యకారుల అభ్యున్నతికి కృషి

ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి



ప్రొసీడింగ్ కాపీని అందజేస్తున్న ఎమ్మెల్యే

పరిగి: మత్స్యకారుల అభ్యున్నతికి ముఖ్యమంత్రి కేసీఆర్ ఎంతో కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. సుల్తాన్‌పూర్ గ్రామానికి చెందిన మత్స్యకారుల నూతన ప్రొసీడింగ్‌ను సొసైటీ సభ్యులకు బుధవారం అందజేసి మాట్లాడారు. తెలంగాణ ఏర్పాటు అనంతరం మత్స్యకారులకు ప్రభుత్వం ఉచితంగా చేపపిల్లను పంపిణీ చేస్తుందని, చాలా గ్రామాల్లో సొసైటీలు లేని వారికి నూతన సొసైటీలను ప్రభుత్వం కల్పిస్తుందని చెప్పారు. అంతే కాకుండా మత్స్యశాఖ ద్వారా చేపలు పట్టే సామగ్రి, వాహనాలను ఉచితంగా పంపిణీ చేసిందని తెలిపారు. ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను బెస్తలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు మారుతి, ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు, ఉపాధ్యక్షుడు సిద్దయ్య, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌ఓసీ అందజేత

పాలేపల్లి గ్రామానికి చెందిన కండెవోని లక్ష్మికి రూ.2లక్షల ఎల్‌ఓసీని ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి అందజేసి మాట్లాడారు. సీఎం సహాయనిధి ద్వారా ఎంతో మంది రోగులకు మెరుగైన చికిత్స కోసం సాయం అందుతుందని, అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ నాగిరెడ్డి, పరిగి ఎంపీపీ అరవింద్ రావు, వైస్ ఎంపీపీ సత్యనారాయణ, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతను ఆగం చేస్తున్న కేంద్రం



జెండా ఆవిష్కరించిన సీపీఐ నాయకులు

కొడంగల్: కార్మిక వర్గాలు పోరాడి సాధించుకున్న చట్టాలను కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిందని సీపీఐ నాయకులు ఆరోపించారు. మేడే వేడుకల్లో భాగంగా బుధవారం పట్టణంలో జెండా ఆవిష్కరించారు. అనంతరం సీనియర్ నాయకుడు ఇందనూర్ బషీర్ మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రైతు వ్యతిరేక చట్టాలను ప్రవేశపెట్టి అన్నదాతలను ఆగం చేస్తుందని విమర్శించారు. కార్యక్రమంలో నియోజకవర్గ కార్యదర్శి మహమూద్, రాజు, రహీం, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

ఆశలను ఆదుకున్న ప్రభుత్వం

బీఆర్‌టీయూ కార్మిక విభాగం జెండాను స్థానిక ఆర్ అండ్‌బీ అతిథిగృహం ఆవరణలో కార్మిక నాయకులు, ఆశ కార్యకర్తలతో కలిసి మేడే సందర్భంగా జెండా ఆవిష్కరించి మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం ఆశ కార్యకర్తలకు వేతనాలు పెంచి ఆదుకుందని కొనియాడారు. కార్యక్రమంలో బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కృష్ణయ్య, ఆశ కార్యకర్తల సంఘం నాయకురాలు మంజుల తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

- మైనర్లకు వాహనాలు ఇవ్వరాదు
- పట్టణ సీఐ రాజేందర్ రెడ్డి



బారికేడ్లు ఏర్పాటు చేసిన పోలీసులు

తాండూరు టౌన్: ట్రాఫిక్ నిబంధనలు పాటించని వాహనదారులకు జరిమానా విధించడంతో పాటు, కఠిన చర్యలు తీసుకుంటామని పట్టణ సీఐ రాజేందర్ రెడ్డి హెచ్చరించారు. ఈ మేరకు ఆయన బుధవారం మాట్లాడుతూ.. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ లేకుండా, వేగంగా, అజాగ్రత్తగా వాహనాలు నడిపి రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారని తెలిపారు. ప్రమాదాల నివారణలో భాగంగా హైదరాబాద్ రోడ్డు మార్గంలోని పలుచోట్ల బారికేడ్లను ఏర్పాటు చేశామని, అలాగే ఫయాజ్ పెట్రోల్ పంపు మార్గం నుంచి రాంగ్ రూట్‌లో ఇందిరాచౌక్‌కు వాహనాలు వస్తున్నాయని, దీని నివారణ కోసం ఇక్కడ వన్‌వేను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. అలాగే మైనర్లకు వాహనాలను ఇవ్వరాదని సూచించారు.

వీఓఏలకు ఉద్యోగ భద్రత కల్పించాలి

అనంతగిరి: ఐకేపీలో పనిచేస్తున్న వీఓఏలకు ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మహిపాల్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేసి మాట్లాడారు. వీఓఏలకు రూ.26వేలకు వేతనం పెంచాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు అరుణ, ప్రధాన కార్యదర్శి ప్రభు, నాయకులు దేవయ్య, పుల్లయ్య, సురేఖ, లక్ష్మి, లావణ్య, రామకృష్ణ మహేందర్‌రెడ్డి, సుజాత, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధరించండి.. ప్రాణాలు కాపాడుకోండి

- ఫోర్ వీలర్ వాహనదారులు తప్పనిసరిగా బెల్టు పెట్టుకోండి
- అవగాహన కార్యక్రమంలో పోలీసులు



పరిగి: అవగాహన కల్పిస్తున్న ఎస్సై విఠల్‌రెడ్డి తదితరులు

పరిగి: ద్విచక్ర వాహనదారులు ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని ఎస్ఐ విఠల్‌రెడ్డి అన్నారు. బుధవారం హైదారాబాద్ బీజాపూర్ జాతీయ రహదారిపై తుంకుల్‌గడ్డలో రోడ్డు ప్రమాదాలు, నివారణ, హెల్మెట్‌పై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఎస్ఐ మాట్లాడారు. హెల్మెట్ ధరించకుండా వాహనాలు నడపడంతోనే చాలా మంది ద్విచక్ర వాహన దారులు చనిపోతున్నారని, హెల్మెట్ ధరించి ప్రాణాలు కాపాడుకోవాలని సూచించారు. పోలీసులపై భయంతో కాకుండా.. కుటుంబ సభ్యుల క్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని తప్పనిసరిగా హెల్మెట్ వాడాలని చెప్పారు. నిబంధనలు అతిక్రమిస్తే జరిమానాతో పాటు చర్యలు తప్పవని హెచ్చరించారు.

సురక్షితంగా గమ్యం చేరుకోవాలి

నవాబుపేట: ద్విచక్ర వాహనదారులు తప్పని సరిగా హెల్మెట్ ధరించి వాహనాలు నడిపి, సురక్షితంగా గమ్యం చేరుకోవాలని ఎస్ఐ భరత్‌భూషణ్ సూచించారు. ఠాణా ఎదుట నుంచి హెల్మెట్ లేకుండా వెళ్తున్న 50 మంది ద్విచక్ర వాహనదారులను ఆపి, హెల్మెట్ వాడకం, ఉపయోగాలు తెలియచెప్పారు.

బొంరాస్‌పేటలో

బొంరాస్‌పేట: హెల్మెట్ లేకుండా వాహనాలు నడపడం వల్లే ప్రమాదాలు జరుగుతున్నాయని ఎస్ఐ శంకర్ అన్నారు. తుంకిమెట్ల జాతీయ రహదారి163పై రోడ్డు ప్రమాదాలు, జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, లేనిచో జరిమానా విధిస్తామని హెచ్చరించారు.

అతివేగం ప్రమాదకరం

కుల్కచర్ల: ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతపై అవగాహన పెంపొందించుకోవాలని ఎస్ఐ గిరి అన్నారు. మండల కేంద్రంలో రోడ్డు భద్రత పట్ల వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ద్విచక్ర వాహనదారులందరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ఫోర్ వీలర్ వారు సీటు బెల్టు పెట్టుకోవాలని సూచించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వరాదని, మితిమీరిన వేగం ప్రమాదకరమని, వేగంతో వాహనాలు నడపవద్దని చెప్పారు. ఈ సందర్భంగా హెల్మెట్ లేకుండా వాహనాలు నడుపుతున్న వారిచేత హెల్మెట్ కొనుగోలు చేయించారు.



నవాబుపేటలో..